క్లుప్తంగా

వరద నీటిని బయటకు పంపించాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): లోతట్టు ప్రాంతాల్లో ఇంకా ఎక్కడైనా వరద నీరు నిలిచి ఉంటే త్వరితగతిన బయటకు పంపేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ కె.కన్నబాబు, కలెక్టర్ సృజనతో కలసి విజయవాడ రూరల్ మండలం అంబాపురంలో బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అంబాపురం పంచాయతీ పరిధిలో ఇంకా నీరు నిలిచి ఉందన్నారు. వరద నీటిని త్వరితగతిన బయటకు పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. పల్లపు ప్రాంతాల్లో నీరు బయటకు వెళ్లేలా కల్వర్టులలో డీసిల్టింగ్ చేయాలని సూచించారు. పరిశీలించిన వారిలో డీపీఓ ఎస్.వి.శివ ప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.

వరద బాధితులకు ఏపీ నూర్ బాషా సంఘం సాయం



భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి పంచాయతీ పరిధిలోని రామరాజ్యనగర్ ప్రాంతంలో బుడమేరు వరద బాధితులకు ఏపీ నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులివెందుల రసూల్ బుధవారం సాయంత్రం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరద ముంచుకొస్తుందని ప్రభుత్వానికి ముందుగానే తెలిసినా ప్రజలకు హెచ్చరిక చేయకపోవడంతో లక్షల మంది పేదలు సర్వం కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాపం సీఎం చంద్రబాబుదేనని స్పష్టం చేశారు. గతంలోనూ ఆయన పబ్లిసిటీ పిచ్చితో గోదావరి పుష్కరాల్లో అనేక మంది భక్తులు ప్రాణం కోల్పోయారని గుర్తు చేశారు. వరద బాధితులను ఆదుకోవడంలో చంద్రబాబు ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యిందని, సాయం అందక బాధితులు చేస్తున్న ఆక్రందనలే అందుకు నిదర్శనమన్నారు. ఏలూరు గాజుల బాజీ, గన్నవరం మస్తాన్, ఎన్టీఆర్ జిల్లా సంఘం అధ్యక్షురాలు షేక్ ఖాసింబీ, షేక్ బుడే, డీ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రజిత కవచాలంకారంలో బాలగణపతి దర్శనం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ బాలగణపతి స్వామి బుధవారం రజిత కవచాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వన్‌టౌన్ పూజారి వారి వీధిలో కొలువై ఉన్న శ్రీ బాలగణపతి ఆలయంలో చవితి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. స్వామి వారికి కృష్ణానది నుంచి మేళాతాళాలతో తీసుకొచ్చిన 108 కలశాలతో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ ఆధ్వర్యంలో విద్యార్థులు డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ప్రముఖ కళాకారిణి నందిని వీణావాదన అలరించింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి శ్రీనివాసరావు, మామిడి లక్ష్మీ వెంకటకృష్ణారావు పర్యవేక్షించారు.

ఉద్యోగుల సేవలతో సంస్థల అభ్యున్నతి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): యూనియన్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ అంబడిపూడి వీరరాఘవశాస్త్రి వంటి ఉద్యోగుల సేవలతోనే సంస్థలు అభ్యున్నతిని సాధిస్తాయని ఎస్ఎల్‌బీసీ కన్వీనర్, యూనియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ సి.వి.ఎస్.భాస్కరరావు అన్నారు. వీరరాఘవశాస్త్రి ఇటీవల ఉద్యోగ విరమణ చేయగా ఆయన అభినందన కార్యక్రమం బ్యాంక్ రీజనల్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం జరిగింది. భాస్కరరావు మాట్లాడుతూ.. ఆంధ్రాబ్యాంక్, ఆ తరువాత యూనియన్ బ్యాంకుల్లో శాస్త్రి పలు హోదాల్లో పని చేశారన్నారు. ఆయన సేవలను అభినందించారు. అనంతరం ఆయనను అతిథులు, బ్యాంకు అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బ్యాంక్ రీజినల్ మేనేజర్ ఎం.వి.శ్రీధర్, పలువురు ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు, పాలు పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద బాధితులకు వైఎస్సార్ సీపీ, జగనన్న అభిమాని చాంద్ బాషా స్నేహితులతో కలిసి బుధవారం సాయంత్రం పాలు, తాగునీరు పంపిణీ చేశారు. వరద ముంపుతో అల్లాడుతున్న రామకృష్ణాపురం, తదితర ప్రాంతాలలో బాధితులకు జగనన్న స్ఫూర్తితో తమ వంతు సహాయంగా స్నేహితులతో కలిసి పాలు, తాగునీరు అందజేస్తున్నట్లు బాషా తెలిపారు.

జక్కంపూడికి అంటువ్యాధుల భయం

- కాలనీలో ఎక్కడ చూసినా వ్యర్థాల దర్శనం
- మురుగు నుంచి భరించలేని దుర్వాసన
- ఇప్పటికే మొదలైన జలుబులు, జ్వరాలు



పాత ఆర్ఆర్‌పేటలో వ్యర్థాలతో నిండిపోయిన రోడ్డు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బుడమేరు ముంపు నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న జక్కంపూడి వాసులను అంటువ్యాధుల భయం వెంటాడుటోంది. కాలనీలోని ఏ వీధిని చూసినా పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలతో నిండి, భరించలేని దుర్వాసన వెలువడుతోంది. దీంతో కాలనీ వాసులు ముక్కు మూసుకుని జీవించాల్సి పరిస్థితులు దాపురించాయి. వరద తగ్గినా జక్కంపూడి కాలనీ లోతట్టు ప్రాంతాల్లోని అంతర్గత వీధుల్లో మురుగు నీరు ఇప్పట్లో బయటకు వెళ్లే పరిస్థితులు కనిపించడం లేదు. కాలనీలోని ప్రధాన రహదారితో పాటు అంతర్గత రోడ్లలో ఎక్కడా కూడా సైడ్ డ్రెయిన్లు లేకపోవడంతో వరద నీరు ఎటూ కదలడం లేదు. దీనికి తోడు వరద బాధితులు తమ ఇళ్లు, దుకాణాలను శుభ్రం చేసుకుంటున్న నీరు కూడా రోడ్లపైకి చేరుతోంది. దీంతో కాలనీలో వరద తగ్గినా ఇంకా మురుగు నీటిలోనే కాలం వెళ్లదీస్తున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గడిచిన తొమ్మిది రోజులుగా వరద ముంపులో కాలం వెళ్లదీసిన కాలనీవాసులు ఇప్పుడు కొత్త భయం వెంటాడుతుంది. ఇప్పటికే కాలనీలోని పలు బ్లాకుల వారిని జలుబు, దగ్గు, జ్వరాలు వెంటాడుతున్నాయి. జ్వర లక్షణాలు కనిపించిన వారు కాలనీలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాల వద్ద బారులు తీరుతున్నారు. కాలనీలోని ఆర్ఎంపీల క్లినిక్‌ల వద్ద గుంపులుగా దర్శనమిస్తున్నారు.

ప్లాట్ల వద్ద పేరుకుపోయిన చెత్త

ప్లాట్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తొలగించడానికి కార్పొరేషన్ సిబ్బంది ససేమిరా అంటున్నారు. దీంతో ఆయా బ్లాకుల్లో నివాసం ఉండే వారే వ్యర్థాలను తొలగించి రోడ్డు పక్కన పడేస్తున్నారు. ఇలా గుట్టలు, గుట్టలుగా పేరుకుపోయిన చెత్తను సైతం తరలించకపోవడంపై కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద నీటితో కొట్టుకు వచ్చిన చెత్తతో పాటు ఇళ్లను శుభ్రం చేసుకుంటున్న కాలనీ వాసులు తడిచిన దుస్తులు, సామగ్రి, వ్యర్థాలను రోడ్డు పక్కనే ఉన్న చెత్త కుప్పల్లో పడేస్తున్నారు. చెత్త తరలించేందుకు కార్పొరేషన్ సిబ్బంది ట్రాక్టర్లతో వచ్చినా అవి మెయిన్ రోడ్డుకే పరిమితం అవుతున్నాయి. దీంతో అంతర్గత రోడ్లు, బ్లాకుల మధ్య చెత్త కొండలా పేరుకుపోతోంది. దీంతో ప్రజలను అంటువ్యాధుల భయం వెంటాడుతోంది. బుడమేరు వరదతో వచ్చిన మురుగు భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. ఖాళీ స్థలాలు, బ్లాకుల మధ్య ఉన్న స్థలాలో ఈ మురుగు నీరడంతో ఇళ్లలో ఉండలేక పోతున్నామని అంటున్నారు.

దాతల కోసం ఎదురు చూపులు

వరద నీరు తగ్గుముఖం పట్టడంతో ఇల్లు, ఇంటిలోని సామగ్రిని శుభ్రం చేసుకునే పనిలో కాలనీలోని కుటుంబాలు నిమగ్నమయ్యాయి. ఇళ్లలోని గ్యాస్ పొయ్యిల్లోకి వరద నీరు చేరడంతో అవి పని చేయడం లేదు. దీంతో కుటుంబంలోని ఒకరు గ్యాస్ పొయ్యిని మరమ్మతులు చేయించేందుకు తీసుకెళ్తే మిగిలిన వారు ఇంటిని శుభ్రం చేసే పనిలో ఉన్నారు. అయితే ఆయా కుటుంబాలకు భోజనం అందకపోవడంతో దాతల కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. కాలనీలోకి ఒకరిద్దరు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ఆహార పొట్లాలను పంచేందుకు రావడంతో పిల్లలు, పెద్దలు అందరూ దాతల వాహనాల చుట్టూ చేరుతున్నారు. వరద నీరు తగ్గిన రోజే ప్రభుత్వం ఆహార సరఫరా నిలిపివేయడం సరికాదని, కాలనీలోని కుటుంబాలు తేరుకునే వరకు ఆహారం సరఫరా చేస్తే బాగుండేదని పలువురు వాపోతున్నారు.



పాత ఆర్ఆర్‌పేటలో మంచినీటి బాటిళ్ల కోసం ప్రజల ఆరాటం



నిత్యావసరాల కోసం క్యూలైన్‌లో నిలిచిన ప్రజలు

తగ్గిన వరద ముంపు.. వదలని మురుగు ముప్పు

వించిపేట(విజయవాడపశ్చిమ): వరద ముంపు తగ్గినప్పటికీ ఇళ్ల ముందు చేరిన బురద, వ్యర్థాలతో పాత ఆర్ఆర్‌పేట ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అన్ని వీధుల్లో వ్యర్థాలు పేరుకుపోవడం, మురుగు నుంచి భరించలేని దుర్గంధం వ్యాపించడంతో సతమతమవుతున్నారు. వరద ముంపుతో సర్వం కోల్పోయిన బాధితులు కనీసం వంట చేసుకోవడానికి కూడా సామగ్రి లేక ఇప్పటికీ దాతలు ఇస్తున్న ఆహారంతోనే కడుపు నింపుకొంటున్నారు. వాడుకోడానికి కాదు కదా కనీసం తాగటానికి కూడా నీరు లేక దాతలు పంపిణీ చేస్తున్న వాటర్ బాటిళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసరాల కోసం అర కిలోమీటరు మేర గంటల తరబడి క్యూ లైన్‌లో నిలిచి తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

అంటువ్యాధులపై భయం

ఇళ్ల ముందు చేరిన వ్యర్థాలు, బురదతో వ్యాధులు ఎక్కడ వ్యాపిస్తాయోనని వరద బాధితులు ఆందోళన చెందుతున్నారు. బీరువాల కంపెనీ రోడ్డు, మహంకాళమ్మ గుడివీధి, సాయిబాబు గుడి రోడ్డు తదిర ప్రాంతాలలోని వీధులన్నీ మురుగుతో నిండిపోయాయి. ఈ మార్గాల్లో ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి రోడ్లపై చేరిన వ్యర్థాలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇన్నర్ రింగ్‌రోడ్డుకు నాలుగు చోట్ల గండ్లు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నగరంలోని వైఎస్సార్ కాలనీ వైవీ రావు రింగ్ నుంచి పైపుల రోడ్డు మధ్య ఉన్న ఇన్నర్ రింగ్‌రోడ్డుకు బుధవారం నాలుగు చోట్ల గండ్లు కొట్టారు. బుడమేరు వరద తగ్గుముఖం పట్టినప్పటికీ పాముల కాల్వ, అంబాపురం గ్రామంతో పాటు గ్రామ పంచాయతీ పరిధిలోని ఇన్నర్ రింగ్‌కు ఎగువగా ఇంకా ముంపు వీడటం లేదు. ఆయా ప్రాంతాల్లో మూడు అడుగుల మేర వరద నీరు నిలిచి ఉంది. దీంతో పలు ఇళ్లు, అపార్టుమెంట్లు, వ్యాపార సంస్థలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఇన్నర్ రింగ్ రోడ్డును పరిశీలించిన అధికారులు రోడ్డుకు గండి కొట్టాలనే నిర్ణయానికి వచ్చారు. తొలుత వైవీ రావు రింగ్ వద్ద ఉన్న కల్వర్టు వద్ద వరద నీరు పారేందుకు చర్యలు తీసుకున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాల్వలో పేరుకుపోయిన గుర్రపు డెక్క, ఇతర వ్యర్థాలను పొక్లెయిన్‌తో తొలగించినీ నీటి ప్రవాహం పెరగలేదు. దీంతో ఇన్నర్ రింగ్‌కు గండ్లు కొట్టాలని నిర్ణయించారు. పైపుల రోడ్డు వైపు నుంచి రెండు, వైవి రావు రింగ్ వైపు నుంచి రెండు గండ్లు కొట్టారు. దీంతో జక్కంపూడి కాలనీ నుంచి పైపుల రోడ్డు వైపు రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు.

14 నుంచి వక్త శిక్షణ తరగతులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): డిగ్రీ నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 14,15 తేదీల్లో ఉచిత వక్త శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు స్టెప్ (స్టూడెంట్స్ టీచర్స్ ఎడ్యుకేటర్స్ పేరెంట్స్) సమన్వయకర్తలు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, ధర్మరెడ్డి, రహిమా బుధ వారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణలో పాల్గొనే విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 13వ తేదీ సాయంత్రం ధ్యాన కేంద్రం వద్దకు చేరుకోవాలని, మరిన్ని వివరాలకు 90306 44440, 81432 34555 సెల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రజాప్రతినిధుల పబ్లిసిటీ పిచ్చితో ట్రాఫిక్ జామ్



ఊర్మిళానగర్‌లో స్తంభించిన ట్రాఫిక్

భవానీపురం(విజయవాడపశ్చిమ): 'యథా సీఎం.. తథా ప్రజాప్రతినిధులు' అన్న చందాన తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధుల పబ్లిసిటీ పిచ్చి పరాకాష్టకు చేరింది. వరద బాధితులకు సాయం పేరుతో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తన అనుచర గణంతో స్థానిక ఊర్మిళానగర్ మెయిన్ రోడ్డులో బుధవారం చేసిన హడావుడితో ట్రాఫిక్ జామైంది. రోడ్డుపై ఒక పక్క సరుకులకు సంబంధించిన లారీ, మరో వైపు ఎంపీ చిన్ని, ఇతర చోటామోటా నాయకులు కార్లతో రహదారి మొత్తం నిండిపోయింది. కనీసం ద్విచక్రవాహనం కూడా ముందుకు వెళ్లలేని పరిస్థితిలో వెనుక ఉన్న వాహనాలన్నీ ఒక్క సారిగా హారన్‌లు మోగించటంతో గందరగోళం నెలకొంది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిద్దామని స్థానికులు ప్రయతిన్నంచినా అక్కడ ఎవరూ వినే పరిస్థితి లేదు. ప్రజాప్రతినిధుల కంట బడాలన్న తాపత్రయంతో టీడీపీ శ్రేణులు చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. అటు ప్రజాప్రతినిధులుగానీ ఇటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు దారిన వచ్చేపోయే సామాన్యుల అవస్థలను పట్టించుకునే పరిస్థితి లేకపోవడంతో నీరసం వచ్చి అలా ఉండిపోయారు. స్థానిక బాధితులు మాత్రం ప్రజలను ఇబ్బంది పెట్టే విధంగా పంపిణీ పేరుతో ఇంత హడావుడి అవసరమా అంటూ అసహనం వ్యక్తం చేశారు.

బాధితులకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద ముంపు బాధితులకు విజయవాడకు చెందిన జయ భారత్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసర సరుకుల పంపిణీ జరిగింది. ట్రస్ట్ సేవా కార్యక్రమాలకు స్పందించిన ఆటోమొబైల్ వ్యాపారి జూలూరి శివప్రసాద్ విదేశాల్లోని బంధు, మిత్రుల సహాయ సహకారాలతో సుమారు లక్ష రూపాయల విలువైన నిత్యావసర సరుకుల కిట్లను అందజేయగా జయ భారత్ చారిటబుల్ ట్రస్ట్ వారధిగా నిలిచి అసలైన బాధితులకు అందజేశారు. స్మార్ట్ కిట్టీ సభ్యుల సహకారంతో ప్లాస్టిక్ టబ్‌లు, మగ్గులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జూలూరి అక్షిత్ కుమార్, ట్రస్ట్ ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాస్ శ్రీవాణి, సెక్రటరీ దేవి పవన్‌కుమార్, ట్రెజరర్ నాగజ్యోతి, ఈసీ మెంబర్ ఈవెంట్ పూర్ణ, ఎస్.శ్రావ్య, ఎస్.ఆనంద సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల రెండో తేదీ నుంచి ముంపు బాధితులకు దుప్పట్లు, టవళ్లు, పాదరక్షలు, పాలు, పండ్లు పంపిణీ చేస్తున్నారు.

మెకానిక్ షెడ్లలకు పోటెత్తుతున్న బైక్‌లు

పాయకాపురం(విజయవాడరూరల్): రోజుల తరబడి వరద ముంపునకు గురైన ద్విచక్రవాహనాలు మరమ్మతుల కోసం మెకానిక్ షెడ్లకు భారీగా వస్తున్నాయి. వరద నుంచి బయటపడిన ప్రాంతాల్లోని ప్రజలు తమ వాహనాలను మెకానిక్‌ల వద్దకు తీసుకొస్తున్నారు. ఈ వాహనాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి నష్టపరిహారం ప్రకటించక పోవడంతో ప్రజలే అప్పు చేసి మరీ మరమ్మతులు చేయిస్తున్నారు. తినడానికి తిండి ఉన్నా లేకున్నా పనులకు వెళ్లాలంటే ద్విచక్రవాహనం అవసరం తప్పదని చిరుద్యోగులు పేర్కొంటున్నారు. పాయకాపురం, కండ్రిక, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లోని మెకానిక్ షెడ్లన్నీ మరమ్మతుల కోసం వచ్చిన బైక్‌లతో పూర్తిగా నిండిపోయాయి.

● మొండికేస్తున్న మోటార్లు



కండ్రికలో మోటార్లకు మరమ్మతులు చేస్తున్న టెక్నీషియన్

బుడమేరు వరదలో మునిగిపోయిన ఇళ్లలోని మోటార్లు మొండికేస్తున్నాయి. కొన్ని తిరగకుండా స్ట్రక్ అవుతున్నాయి. మరి కొన్నింటిలో వైండింగ్ కాలిపోయింది. బాధితులు వాటిని మరమ్మతుల కోసం మెకానిక్ షాపుల వద్దకు తీసుకొస్తున్నారు. కండ్రిక ప్రధాన రహదారిలో ఓ షాపు వద్ద పదుల సంఖ్యలో మోటార్లు మరమ్మతులకు తీసుకొచ్చారు. వాటిలో చాలా వరకూ వైండింగ్ కాలిపోయినట్లు టెక్నీషియన్ పేర్కొన్నారు. రెండు రోజుల్లో వందకు పైగా మోటార్లు రిపేరు కోసం వచ్చాయని వివరించారు.

– లబ్బీపేట(విజయవాడతూర్పు)

లైన్ బాక్స్‌లను పునరుద్ధరించాలి

కార్మిక సంఘం డివిజనల్ కార్యదర్శి అశోక్‌కుమార్



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా గార్డ్స్ కౌన్సిల్ విజయవాడ డివిజన్ ఆధ్వర్యంలో గార్డ్స్ సిబ్బంది విజయవాడ రైల్వే స్టేషన్‌లోని గార్డ్స్ లాబీ ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘం విజయవాడ డివిజన్ కార్యదర్శి అశోక్ కుమార్ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా గార్డ్స్ సిబ్బందికి ఉన్న లైన్ బాక్స్ సదుపాయం తొలగించడం సరైన చర్య కాదన్నారు. లైన్ బాక్స్‌కు బదులుగా ట్రాలీ బ్యాగులను అందజేయడంతో విధులకు వెళ్లే గార్డ్స్ సిబ్బంది తమ లగేజీకి అదనంగా ట్రాలీ బ్యాగులను తీసుకెళ్లడం కష్టంగా ఉంటుందన్నారు. కనీసం లాకర్ సదుపాయం కూడా లేకపోవడంతో ట్రాలీ బ్యాగులను ఇళ్లకు మోసుకెళ్లి, తిరిగి విధులకు తీసుకురావాల్సిన పరిస్థితి ఉందని వివరించారు. ట్రాలీ బ్యాగులో ప్రమాదకరమైన డిటోనేటర్లను ఉంచడంతో వాటిని ఏవిధంగా ఇళ్లకు మోసుకెళ్లాలో అధికారుల పునరాలోచన చేయాలని కోరారు. గార్డ్స్‌కు టెయిల్ ల్యాంపు, సిగ్నల్ ల్యాంపులు కూడా సరఫరా చేయడం లేదని ఆరోపించారు. అధికారులు స్పందించి గార్డ్స్ సిబ్బంది న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా గార్డ్స్ కౌన్సిల్ డివిజనల్ సెక్రటరీ కె.మోహన్ దాస్, ఎండీ నజీర్ అహమ్మద్, కార్మిక సంఘం సహాయ కార్యదర్శి పూర్ణ చంద్రరావు పాల్గొన్నారు.

వరద నీటి నిల్వలు లేకుండా చూడండి

మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర



వరద ప్రభావిత ప్రాంతంలో పరిస్థితిని తెలుసుకుంటున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): వరద నీటి నిల్వలు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, రోడ్ల వెంబడి వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని సంబంధిత అధికారులను మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాలైన నందమూరినగర్, వాంబే కాలనీ, కండ్రిక సెంటర్, సీవీఆర్ ఫ్లై ఓవర్ ప్రాంతాల్లో కమిషనర్ బుధవారం ఉదయం పర్యటించారు. నందమూరి నగర్‌లో భూగర్భ డ్రెయినేజీ, పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి కుళాయిల్లో వస్తున్న నీటిని వాడుక అవసరాలకు మాత్రమే వినియోగించాలని సూచించారు. తాగు నీటిని ప్రత్యేకంగా ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నామని వివరించారు. రోడ్లపై నీటి నిల్వలను వెంటనే తొలగించాలని, ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ఉండేందుకు తరచూ బ్లీచింగ్ చల్లాలని అధికారులను ఆదేశించారు. వరదలో కొట్టుకొచ్చిన వ్యర్థాలను తొలగించడానికి 465 వాహనాలను వినియోగిస్తున్నామని వివరించారు. 184 ట్రాక్టర్లు, 122 టిప్పర్లు, 65 జేసీబీలు, 22 బోబ్‌క్యాట్‌లు, 13 డోజర్లు, ఏడు పొక్లెయిన్లు, రెండు క్రేన్లు, 25 కాంపెక్టర్లు, 23 ఎయిర్‌టెక్ మెషిన్లతో వరద ప్రభావిత ప్రాంతాలను శుభ్రం చేస్తున్నామని వివరించారు. ఇతర ప్రాంతాల్లోని మునిసిపాలిటీల నుంచి వచ్చిన 6,830 మంది పారిశుద్ధ్య కార్మికులు, 950 మంది శానిటరీ సూపర్‌వైజర్లు, 62 మంది శానిటరీ నోడల్ ఆఫీసర్లు,149 మంది పురపాలక, పట్టణ అభివృద్ధి శాఖ, వార్డ్ సచివాలయ స్పెషల్ ఆఫీసర్లు, 32 మంది వార్డ్ స్పెషల్ ఆఫీసర్లు, ప్రతి వార్డుకు ఒక ఐఏఎస్ అధికారి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులను శరవేగంగా చేస్తున్నామని తెలిపారు.

వరద బాధితులకు అండగా ప్రభుత్వం

ఎమ్మెల్యే సుజనా చౌదరి



కామకోటినగర్‌లో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న సుజనా చౌదరి, గల్లా మాధవి

భవానీపురం(విజయవాడపశ్చిమ): వరద బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. ఊర్మిళానగర్, ఏకలవ్యనగర్, జోజినగర్, పున్నమిఘాట్, పడవల రేవు తదితర ముంపు ప్రాంతాల్లో ఆయన బుధవారం పర్యటించి బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయం సక్రమంగా అందుతుందీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. తమ ఇళ్లల్లోని వస్తువులన్నీ ముంపులో పాడైపోయాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. నష్టాన్ని అంచనా వేసేందుకు ప్రత్యేక అధికారులను నియమించామని, బాధితులందరికీ నష్ట పరిహారం అందుతుందని హామీ ఇచ్చారు. ఏకలవ్యనగర్‌లో మునిగిపోయిన ఇళ్లను శుభ్రం చేసేందుకు ఫైర్ ఇంజిన్లను ఏర్పాటు చేయాలని కోరగా వెంటనే సంబంధిత అధికారులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో అడ్డూరి శ్రీరామ్, బొమ్మసాని సుబ్బారావు, పైలా సోమినాయుడు, బొమ్ము గోవింద లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. విద్యాధరపురం కామకోటినగర్‌లోని బాధితులకు గుంటూరు ఎమ్మెల్యే గల్లా మాధవితో కలిసి సుజనా చౌదరి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. రేగళ్ల లక్ష్మణరావు, సత్యవాణి, శివలీల, వి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి దసరా మహోత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): స్థానిక శ్రీ మహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో అక్టోబర్ మూడు నుంచి 12వ తేదీ వరకు దసరా మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు సుదురుమాటి కృష్ణప్రసాద్ శర్మ, రెంటచింతల కాశీ విశ్వనాథశర్మ తెలిపారు. ఉత్సవాల నేపథ్యంలో నిత్యం ఉదయం విశేష అలంకారాలలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని పేర్కొన్నారు. తొలి రోజు శ్రీమహాలక్ష్మీ దేవిగా, నాలుగున శ్రీబాలా త్రిపుర సుందరీదేవి, ఐదున గాయత్రీదేవిగా, ఆరున శ్రీఅన్నపూర్ణా దేవిగా, ఏడున శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా, ఎనిమిదిన సంతోషిమాతగా, తొమ్మిదిన మూలా నక్షత్రం సందర్భంగా శ్రీ సరస్వతీదేవిగా, పదిన శ్రీదుర్గాదేవిగా, 11న మహిషాసుర మర్దినీ దేవిగా, 12వ తేదీన శ్రీరాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు దర్శనమిస్తారని వివరించారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక క్యూలైన్లు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం వేదికను ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు తెలిపారు.

బాధితులకు నిత్యావసర కిట్ల పంపిణీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఊర్మిళానగర్ వరద బాధితులకు రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్‌తో కలిసి బుధవారం నిత్యావసర కిట్లను పంపిణీ చేశారు. కర్నూలు జిల్లా నుంచి మంత్రి భరత్ నేతృత్వంలో నిత్యావసర కిట్లను తీసుకొచ్చిన టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు వాటిని బాధితులకు అందజేశారు. ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలతో కలిసి భరత్ వరద బాధితుల ఇళ్లకు వెళ్లి పరామర్శించారు.

ముంపు ప్రాంతాల్లో ఎన్యూమరేషన్

పాయకాపురం(విజయవాడరూరల్): నగర శివారు ప్రాంతాలైన సుదరయ్యనగర్, రాజీవ్‌నగర్, రాధానగర్, కండ్రిక ప్రాంతాల్లో వరద ముంపునకు గురైన ఇళ్ల వద్ద సచివాలయ సిబ్బంది బుధవారం సర్వే చేశారు. వరదల్లో ఇంటికి ఎంత మేర నష్టం జరిగిందనే సమాచారాన్ని బాధిత కుటుంబాల నుంచి సేకరించారు. ఇంటిలో విలువైన గృహోపకరణాల వివరాలను కూడా అడిగి తెలుసుకుని నమోదుచేశారు.